

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 16 సంచిక : 03 నవంబర్ 2010

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు ~ 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....
జిన్నూరు ....... 02-10-2010
నరసాపురం .. 17-10-2010

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 02-10-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కృష్ణుడు అంటే బ్రహ్మపదార్థము. బ్రహ్మపదార్థమే కాళ్ళు చేతులు ధరించి వచ్చి చెప్పింది కాబట్టి కృష్ణుడు చెప్పిన దానిని భగవద్గీత అంటారు అంటే బ్రహ్మము చేత చెప్పబడింది. నన్ను తెలుసుకోండి అని కృష్ణుడు గీతలో అన్నప్పుడు బ్రహ్మంను తెలుసుకోమని చెప్పటం. నాకు ఇష్టమైన పని చేయండి, నన్ను స్మరించుకోండి, నన్ను ప్రేమించండి, నన్ను జ్ఞాపకం పెట్టుకోండి అని కృష్ణుడు అన్నప్పుడు అక్కడ బ్రహ్మమే చెపుతోంది గాని ఒక వ్యక్తి కాదు. సర్వసాధారణంగా పెద్దవారు ఏమి చేస్తారు అంటే వారు చెప్పేది ఏదో చెపుతూ ఉంటారు కాని ఫలానా వారిచేత ఇది చెప్పబడింది అని మనం అనుకోవాలని వారు అనుకోరు ఎందుచేతనంటే అక్కడ దేహభావన ఉండదు. అక్కడ సబ్జక్టు ప్రధానం కాని ఎవరు చెపుతున్నారు అనేది ప్రధానం కాదు. యజ్ఞ శబ్దానికి వేదంలో రకరకాల అర్థాలు చెపుతారు. వాటిని సమన్వయం చేసి మనకు ఉపయోగపడేలాగ ఇక్కడ భగవంతుడు చెప్పాడు. యజ్ఞం అంటే నువ్వు గౌరవం ఆశించకుండా, స్వార్థం లేకుండా రవ్వంత, ముల్లంత చిన్నపని చేసినా అది యజ్ఞంతో సమానము, దాని వలన నీకు యజ్ఞ ఫలితం వస్తుంది అని చెప్పాడు. మీరు ఏదైనా మంచిపని చేసినా, మిమ్మల్ని ఎవరైనా ఏదైనా అన్నా వాటిని వెంటనే మర్చిపోవాలి కాని వాటిని నెత్తిమీద మోయకూడదు.

నా శరీరానికి ఏదైనా రోగం వచ్చింది అనుకోండి మందులు వేసుకొంటాను అప్పుడు నేను ఎవరికైనా సహాయం చేసాను

అనుకొంటానా, అనుకోను. అదే ఇంకొకరి శరీరానికి మందులు ఇప్పిస్తే వారికి సహాయం చేసాను అనుకొంటాను. అంటే నా ఉపాధికంటే ఆ ఉపాధిని భిన్నంగా చూస్తున్నాను కదా. ఇంక మనం అజ్ఞానంలో కూరుకొని పోతాము, మన పని అయిపోయినట్లే, మనలను తీసివేత కొబ్బరికాయలలో పడేస్తారు. ఈ ఉపాధిబుద్ధిని మనం దాటాలి. దేహము నేను అనే బుద్ధిలో నుండే అంతా వస్తోంది. మనం అస్తమాను నేను, నేను అంటాము కదా. మనం ఏదైతే నేను నేను అంటున్నామో ఆ నేను నేను కాదని నీకు అనుభవంలోనికి వచ్చే వరకూ నీకు బ్రాహ్మీస్థితి కలుగదు. ఈ సృష్టిలో ఆత్మజ్ఞానంతో సమానమైనది ఏమీ లేదు. మనం కాలేజీలో, యూనివర్సిటీలో చదువుకోవటం వలన బ్రహ్మ విద్య రాదు, ఆత్మజ్ఞానం రాదు. వాటివలన ఏదో పని నేర్చుకొంటాము, ఏదో చాకిరీ చేసుకొంటూ బతుకుతూ ఉంటాము. ఈ చదువులవలన పొట్ట వెళ్లిపోతుంది కాని మనలో ఉన్న మూర్ఖత్వం పోదు. చదువుకున్న మూర్ఖులు, చదువులేని మూర్ఖులు అని రమణమహర్షిగారు అంటూ ఉండేవారు. మనం చదువుకొని ఎన్ని డిగ్రీలు సంపాదించుకొన్నా మనలో ఉన్న మూర్ఖత్వం పోదు. ఏదో చదువుకొన్నాము, ఏదో ఉద్యోగం చేసుకొంటున్నాము అనుకొంటాము గాని లోపలఉన్న అజ్ఞానాన్ని, అహంభావనను, మనలో ఉన్న రూపబుద్ధిని, నామబుద్ధిని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేయాలి అనే బుద్ధి మనకు కలుగనే కలుగదు. ఎందుచేతనంటే మనకు సజ్జన సాంగత్యం లేదు, సత్పురుషులసహవాసం లేదు.

నువ్వు దేహంగా ఉన్నప్పుడు కూడా నీవు దేహం కాదు, మనస్సుగా ఉన్నప్పుడు కూడా నువ్వు మనస్సుకాదు, నీ శరీరం చనిపోయాక ప్రయాణం చేసేవాడు కూడా నువ్వు కాదు. నువ్వు ఏదిగా ఉన్నావో అది నీకు తెలియపరచే విద్యనే బ్రహ్మవిద్య, ఆత్మవిద్య అని అంటారు. ఆత్మవిద్యను సంపాదించాలి అంటే నువ్వు ఇంద్రియాలను ఉపసంహరించాలి, రాగద్వేషాలను ఉపసంహరించాలి, విజృంభించి వస్తున్న నీ మనస్సును లోపలకు పంపాలి. ఇన్ని రకాలుగా నీతోటి నువ్వు యుద్ధం చేస్తేనేగాని ఆత్మవిద్య రాదు. ఇంద్రియాలతో నేర్చుకొనే విద్యను సాపేక్షిక విద్య అంటారు. సాపేక్షిక విద్య నేర్చుకోవటానికి నీతోటి నువ్వు యుద్ధం చేయనక్కరలేదు. నీ దేహం దేహంలాగే ఉంటుంది, ప్రపంచం ప్రపంచంలాగే ఉంటుంది, ఈలోపులో ఏదో పొట్ట వెళ్లిపోతుంది. ఏదో ఒకరోజున చనిపోతారు. వాడు జననమరణ చక్రంలోనుండి బయటకు రాలేడు. మీకు విద్య అంటే బాగా ఇష్టం అనుకోండి చాలా కష్టపడి చదువుకొంటారు, మీకు డబ్బు అంటే ఇష్టం అనుకోండి ఎంతో కష్టపడి డబ్బు సంపాదించుకొంటారు. మీకు చాలా

ఉందికదా ఇంకా ఎందుకు ఇంత కష్టపడుతున్నారు అని మనం అడిగితే ఏమండీ డబ్బు సంపాదించటం నాకు అలవాటు అయిపోయింది మట్టిలో కలిసిపోయే వరకు నేను ఇలాగే ఉంటాను అని చెపుతారు. బ్రహ్మజ్ఞానం యొక్క విలువ మనకు తెలియటం లేదు కాబట్టి దానిని మనం సంపాదించుకోవటంలేదు.

మనం ఏ శరీరంలో ఉండగా ఆ శరీరం ఒక్కటే నిజం అనుకొంటాము, ఇదే మాయ. ఇప్పుడు ఈ దేహం ఉంది. ఈ దేహం చనిపోతుంది. ఇంకో దేహం వస్తుంది. ఇప్పుడు ఇది నూటికి నూరుపాళ్ళు నిజం అనుకొంటున్నాము కదా అలాగే ఆ దేహంలో ఉన్నప్పుడు అదే నిజం అనుకొంటాము. మరల ఆ దేహం కూడా పోతుంది ఇంకో దేహం వస్తుంది. అప్పుడు అది నిజం అనుకొంటాము. రంపం పెట్టి కోసేసినా ఈ ఉపాధిబుద్ధి మనకు పోదు. దేహం నేను కాకపోయినా, మనస్సు నేను కాకపోయినా, రాగద్వేషాలు నేను కాకపోయినా అవి నేను అని వాటితో తాదాత్మ్యం పొందుతున్నాము. వాటిలో నుండి బయటకు రావాలి అంటే మనం కష్టపడి సాధన చెయ్యాలి, కాలం కలిసిరావాలి, వీటి అన్నింటికంటే ముఖ్యంగా పరమేశ్వరుని దయ ఉండాలి. ఇవన్నీ కలిసి వస్తేగాని మనం ఒడ్డుకు రాలేము. నిన్ను నీకు పట్టి ఇచ్చేది, నీ స్వరూపం దగ్గరకి నిన్ను చేర్చేది, ఈ చావుపుట్టుకలను నీచేత ఓవర్‌కమ్ చేయించేది ఒక్క బ్రహ్మవిద్య మాత్రమే. లౌకికవిద్యల వలన నీకు బాహ్యంగా గౌరవాలు రావచ్చు, డబ్బు రావచ్చు కాని అవి నిన్ను పవిత్రం చెయ్యలేవు. అవి కేవలం ఇంద్రియాలకు, దేహానికి, లోకానికి పరిమితం. ఒక్క బ్రహ్మవిద్య మాత్రమే నిన్ను పవిత్రుడిని చేస్తుంది. ఆత్మ విద్య కంటే నిన్ను పవిత్రం చేసే విద్య మరొకటి లేదు అన్న సంగతి నువ్వు లోతుగా అర్థం చేసుకో.

మీరు సత్కర్మ కూడా నిష్కామంగా చేయాలి. సత్కర్మ నిష్కామంగా చెయ్యరు అనుకోండి మీరు చేసిన సత్కర్మకు పుణ్యం వస్తుంది. ఆ పుణ్యం అనుభవంలోనికి వచ్చినప్పుడు ఏవో కొన్ని భోగాలు వస్తాయి. ఆ భోగాలు కాలప్రవాహంలో పోతాయి కాని ఆ భోగాలను ఎంజాయ్ చేసినప్పుడు మనలో కొన్ని వాసనలు పడతాయి, ఆ వాసనలు కొన్ని లక్షల జన్మలను తీసుకొనివస్తాయి. ఎవడో గురువు సహాయం లేకపోతే వీటిలోనుండి మనం బయటకు రాలేము. మనం లడ్డు తింటాము అనుకోండి, ఆ లడ్డు చాలా బాగుంది, చాలాబాగుంది అనుకొంటాము. లడ్డు రెండు నిమిషాలలో తినేస్తాము. లడ్డు బాగుంది అనే తలంపు మన బ్రెయిన్‌లో ఉండిపోతుంది. మరల ఆ లడ్డు ఎక్కడ దొరుకుతుంది అని చూస్తాము. ఆ వాసన అంత తొందరగా పోదు, మన శరీరాన్ని సబ్బు పెట్టి కడిగినంత తొందరగా అది పోదు,

ఆ వాసన మనలను పీడించేస్తుంది. నీ బుద్ధి శుద్ధి అవ్వాలంటే నువ్వు నిష్కామకర్మ చేయటంలో ఎక్స్‌పర్ట్ అవ్వాలి. మనలో నిష్కామకర్మ ఎవరు చేస్తున్నారు. మనం నిష్కామకర్మ చెయ్యకపోయినా చేస్తున్నాము అని అనుకొంటున్నాము, ఇదో ప్రమాదం. నేను చాలామంది మంచివారిని చూసాను. వారు కొన్ని మంచిపనులు చేస్తారు. ఆ మంచిపనులు చేసి అవి నేనే చేసానండి, అక్కడ కష్టపడ్డానండి, ఇక్కడ డబ్బులు ఖర్చుపెట్టానండి అని ఏవో చెపుతారు అంటే వాళ్ళ కోర్సు ఫినిష్ అయిపోయింది. అది కూడా సకామకర్మే కాని నిష్కామకర్మకాదు. ఎందుచేతనంటే నీకు లోపల కీర్తికాంక్ష ఉంది. నీకు ఏ కాంక్ష ఉన్నా అది సకామం అవుతుంది కాని నిష్కామం అవ్వదు. ఇది ఒక్కటీ గుర్తు పెట్టుకోండి. మీరు ఎవరికైతే సహకరించారో వారి దగ్గర నుండి ఏమీ ఆశించకపోయినా చాలా ఉపకారం చేసాము కనీసం వీరికి మన పట్ల గౌరవం లేదు అనుకొంటారుకదా అప్పడు ఇంక అది నిష్కామకర్మ కాదు సకామకర్మే అవుతుంది. ఇదేమిటి వీరు మన పట్ల కృతజ్ఞత చూపించటంలేదు అని ఎవరితోటి అనక్కరలేదు, మనస్సులో అనుకొంటేచాలు, మనస్సులో గౌరవం ఆశిస్తే చాలు ఇంక మీ కోర్సు అయిపోతుంది బేబీ నువ్వు చాలా బాగా సబ్జక్టు చెపుతున్నావు అని అంటాను అనుకోండి నేను ఆ మాట అనక ముందు బేబీ ఎలా ఉందో, ఆ మాట అన్నాక కూడా అలాగే ఉండాలి. నా మాట విన్నాక సంతోషం వచ్చింది అనుకోండి ఇంక తీసి పడేస్తారు. అంటే పైకి ఏమీ అనకపోయినా లోపల సంతోషిస్తోంది కదా అంటే అది సకామకర్మే. అంటే నిష్కామకర్మ ఎంతకష్టమో మీకు చెపుతున్నాను. అంటే కీర్తి కాంక్ష కూడా పనికిరాదు. కీర్తి కాంక్ష వదిలేస్తే మనకు తెలియకుండా రూపబుద్ధి, నామబుద్ధి పోతాయి. పరమేశ్వరుడికి రూపం లేదు, నామం లేదు. ఆయన లేడా అంటే ఉన్నాడు. మనం రూపబుద్ధి, నామబుద్ధి పెట్టుకొని, అహంభావన పెట్టుకొని, వ్యక్తి భావన పెట్టుకొని జీవిస్తూ ఉంటే ఇలా కోటి జన్మలు ఎత్తినా ఆత్మజ్ఞానం అందే అవకాశం లేదు.

ఆపరేషన్ చేసేటప్పడు ఎక్కడైతే ఆపరేషన్ చేస్తారో అక్కడ అంతా స్పిరిట్‌తో శుభ్రం చేస్తేనేగాని బల్లమీద ఎక్కించరు. మన మనస్సులో ఎంతో మసి ఉంది, ఎన్నో బలహీనతలు ఉన్నాయి. జపం పేరుమీద, ధ్యానం పేరుమీద, నిష్కామకర్మ పేరుమీద మనస్సును శుద్ధి చెయ్యాలి. అలా మనస్సును శుద్ధి చెయ్యరు అనుకోండి ఇంక మనకు జ్ఞానం అంటదు. కపటం ఉన్నవారికి, మాయ మాటలు చెప్పేవారికి జ్ఞానం ఏమిటండి. ఒకచోట స్వామీజీ అన్నారు మీరు మాట్లాడే చెడ్డమాటలకు, మీకు వచ్చే చెడు ఆలోచనలకు, మీరు చేసే చెడ్డ పనులకు వీటి అన్నింటికి ఫలితం రెడీగా ఉంది. మనిషిని చూసేటప్పటికి పులి ఎలా మీద

పడుతుందో అలాగే మీరు చేసిన కర్మ సడన్‌గా వచ్చి మీద పడి మిమ్మల్ని మింగేస్తుంది అన్నాడు స్వామీజీ. ఆత్మజ్ఞానసముపార్జనకు సాధన చెయ్యాలి. దానికోసం ఎదురుచూడకూడదు. సాధన లేకుండా సిద్ధి కలుగదు. మీకు భగవంతుడు వచ్చి కనిపించి నీకు కోటి జన్మల దాకా మోక్షం ఇవ్వను అంటాడు అనుకోండి. నీ ఇష్టం అనాలి అంతేగాని నాకు సాయంత్రం ఇచ్చేయండి, రేపు ఇచ్చేయండి అని అడగకూడదు. అంటే మనకు మినహాయింపులు ఉండకూడదు, కాలక్రమంలో నీవు బాగా శుద్ధుడవు అవుతూ ఉంటే, నువ్వు నిర్మలంగా ఉంటే, నిశ్చలంగా ఉంటే, నీ మనస్సు పవిత్రం అవుతూ ఉంటే, నీవు నేను అనే బేధబుద్ధి తగ్గుతూ ఉంటే ఎక్కడో వైకుంఠంలోను, కైలాసంలోను కాదు నీ హృదయంలోనే నీకు జ్ఞానోదయం కలుగుతుంది. మనకు శ్రద్ధ లేదు అనుకోండి, ఆత్మజ్ఞానం పొందాలి అనే బుద్ధి లేదు అనుకోండి ఇవన్నీ మీకు అబద్దాలకింద అనిపిస్తాయి. మీరు అభ్యాసం తరువాత చేద్దురుగాని అసలు ఈశ్వరుడు చెప్పిన మాట మీద మీకు విశ్వాసం కలుగుతోందో లేదో ముందు చూసుకోండి.

మనం పూర్వజన్మలలో చేసిన కర్మే ఈ శరీరాలను తీసుకొని వచ్చింది. రామకృష్ణుడు వాళ్ళ శరీరాలు ప్రారబ్దం తీసుకొని రాలేదు, అవి లోకాన్ని వెలుగుతోటి నింపటానికి వచ్చిన కారణ శరీరాలు. మన శరీరాలు ప్రారబ్దం అనుభవించటానికి వచ్చాయికాని వారి శరీరాలు ఏదో కారణం నిమిత్తం వచ్చాయి కాని అనుభవించటానికి ఇక్కడికి రాలేదు, అనుభవించటానికి వారి స్టోర్‌లో ఏమీలేదు, వారు కారణజన్ములు. మనకు చనిపోయేవరకు ఏదో ఒకటి అనుభవించటమే ఇంకో పనిలేదు. ఒకరోజున సంతోషం, ఒకరోజున దుఃఖం ఇలా అహంకారాన్ని వేసుకొని తిరుగుతూ ఉంటాము. నువ్వు వందలాది జన్మలలో సాధన చేసి పోగొట్టుకోలేనిది ఒకోసారి గురువు అనుగ్రహం వలన ఆ ప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. ఒక్కసారి గురువు నిన్ను అలా షేక్ చేస్తే చాలు నీ అహంకారం పడిపోతుంది, గురువు అనుగ్రహం అంత బలీయమైనది. మీ పొట్టకోసం ఇతరుల మీద ఆధారపడకుండా ఏదో పని చేసుకొంటూ మిగతా టైము అంతా ఈశ్వరుడి ప్రీత్యర్థం పనిచేయండి. యజ్ఞదాన తపస్సులు నువ్వు పవిత్రుడవు అవ్వటానికే ఏర్పాటు చేసారు. హృదయశుద్ధి ఉండాలి. తెలివిగలవారు ధన్యులు వారు దేవుని చూచెదరు అని ఎక్కడా చెప్పలేదు. హృదయశుద్ధి గలవారు ధన్యులు వారు దేవుని చూచెదరు. అందుచేత హృదయశుద్ధి ముఖ్యం.

కొంతమంది చాలా కష్టపడతారు కాని సంపాదన ఏమీ ఉండదు. కొంతమందికి చేసినదల్లా కలిసివస్తుంది. దీనికి పూర్వజన్మలకు సంబంధం ఉంటుంది. లాభం అయినా,

నష్టం అయినా అలా వస్తూఉంటాయి, పోతూఉంటాయి. నువ్వు మనస్సును ఎక్కడ కేంద్రీకరించాలో అక్కడ పెట్టు. లాభం వచ్చినప్పడు పొంగిపోకు, నష్టం వచ్చినప్పడు కృంగిపోకు. అప్పడు నీ బుద్ధికి సమానత్వం వస్తుంది. పరిస్థితులు నీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా అక్కడ పరమాత్మనే చూడటం నేర్చుకో. అదృష్టంలోను, దురదృష్టంలోను భగవంతుడినే చూడు. ఇదంతా స్వప్న సమానము. స్వప్నంలో చూసే మనుషులు, సంఘటనలు ఎంత అసత్యమో ఈ జాగ్రదవస్థ కూడా అంతే అసత్యం అన్నారు ఆచార్యులవారు. నీ ప్రారబ్దంలో ఉన్నది వస్తూ ఉంటుంది. ఈశ్వర నిర్ణయ ప్రకారం ఏది ఎప్పడు ఎలా జరగాలో అలా జరుగుతూ ఉంటుంది. వాటి గురించి ఆలోచించి నీ తలకాయ పాడుచేసుకోవద్దు అని చెప్పారు. ఈ లోకానికి నువ్వు అధ్యక్షుడు కాదు, పరమేశ్వరుడే ఈ లోకానికి అధ్యక్షుడు. వాడి అధ్యక్షతన ఇది అంతా జరుగుతూ ఉంటుంది. ఆయన అధ్యక్షత వహించకపోతే ఈ లోకం జడం. భగవంతుడు అధ్యక్షత వహించాకే ఈ లోకానికి యాక్టివిటీ వస్తుంది. మీరు ఇంట్లో వారి పట్ల అయినా, బయటివారి పట్ల అయినా మీ డ్యూటీ మీరు చెయ్యాలి కాని బెంగపెట్టుకో కూడదు. అలా బెంగపెట్టుకొంటే జీవరూపంలో ఉన్న ఈశ్వరుడిని హింస పెట్టినట్లు అవుతుంది. జీవుడి రూపంలో ఉన్నవాడు కూడా ఈశ్వరుడే, వాడిని హింసపెట్టుకోకూడదు. నీ దుఃఖ సముద్రాన్ని ఆనందసముద్రంగా మారుస్తాను అంటాడు ఏసు. మీరు విశ్వాసపాత్రులు అయితే మీ దుఃఖసముద్రాన్ని ఆనందసముద్రంగా మార్చటానికి సిద్ధంగా ఉన్నాను అయితే మీరు విశ్వాసపాత్రులా, విశ్వాసహీనులా అది చూసుకోండి. రీజను మంచిదే కాని భగవంతుడికి సంబంధించినంతవరకు రీజను కంటే విశ్వాసం ఎక్కువ పనిచేస్తుంది. రామకృష్ణుడి శిష్యులలో ఒకడికి చదువురాదు, వాడి పేరు లాటు. మిగతావారు అందరూ చదువు గొడవలో ఉన్నారు కాని వీడికి సమాధిస్థితి వచ్చేసింది అంటే వాడు పరిపూర్ణంగా రామకృష్ణుడిని విశ్వసించాడు, తనకంటూ మినహాయింపులు ఏమీ లేవు.

నువ్వు ద్వంద్వాలకు అతీతంగా ఉండు. లోకంలో ఎవరిని చూసి అసూయపడవద్దు. నువ్వు అసూయ పడవలసింది అంటూ ఈ లోకంలో ఏదీ లేదు. ఎదుటివాడు బాగున్నాడని వాడిని చూసి అసూయ తెచ్చుకోవద్దు. వాడు పూర్వజన్మలో ఏదో పుణ్యంచేసి ఉండవచ్చు ఈ జన్మలో అలా ఉన్నాడు. ఇది వాడికి భగవంతుడికి సంబంధించిన విషయం. ఆ గొడవ నీకు ఎందుకు. ఒక మనిషి వెళ్ళి కొండమీద కూర్చున్నాడు అనుకో. వాడి గౌరవం చూసి నీకు అసూయ కలిగింది అనుకో, నీకు ఇష్టం లేనంత మాత్రంచేత కొండమీద కూర్చున్న మనిషిని

లోకానికి కనబడకుండా చేయగలవా? భగవంతుడే వాడిని కొండమీద కూర్చోబెట్టినప్పుడు నీ అసూయ ఎంత? నువ్వు ఎంత? ఎంతమంది కళ్ళు నువ్వు మూయగలవు. అందుచేత ఇటువంటి గొడవలు నీకు వద్దు. నువ్వు బాగుపడే మార్గం చూసుకో. నువ్వు సాధన చేస్తూ ఉండు. నిన్ను ఆత్మజ్ఞానంతో ఎప్పుడు అలంకరించాలో భగవంతుడు చూసుకొంటాడు. నీ ప్రయత్నంలో నువ్వు ఉండటం మానేసి 24 గంటలు దేహం చుట్టూ తిరుగుతూ ఉంటే ఎలాగ. జీవకోటి అంతా మనో దేహములకు కట్టుబడి ఉంటున్నారు. వారి ఆలోచన అంతకంటే దూరం వెళ్ళటంలేదు. ఎప్పుడూ మనస్సును మూసేసుకొంటున్నారు. మీ ఇంటి తలుపులు తీసుకొని ఉంటే ఇంటిలోనికి గాలి వేస్తుంది కాని తలుపులు మూసుకొని ఉంటే లోపలకు గాలి ఎలా వస్తుంది. తలుపులు అన్నీ మూసేసుకొని గాలి రావటంలేదు, గాలి రావటంలేదు అంటే ఇంక మీకు ఎవరు చెపుతారు. మీ గొడవలు ప్రక్కనపెట్టి భగవంతుడు చెప్పింది వినాలి కదా. మీరు 24 గంటలు దేహానికి, మనస్సుకు బంధింపబడి ఉంటే ఇంక మీకు వెలుగు ఎలా కనిపిస్తుంది. రెండు కళ్ళు మూసుకొని సూర్యుడు లేడు అంటే ఇంక మీకు ఎవరు సమాధానం చెపుతారు. భగవంతుడికంటే మన క్షేమం కోరేవాడు ఎవడూ లేడు. అన్ని అవస్థలలో మన కూడా ఉన్నవాడు భగవంతుడే. ఆయన సర్వజ్ఞుడు. భగవంతుడిని నమ్మితే సొమ్ము, నమ్మకపోతే దుమ్ము.

మనస్సు ఎప్పుడూ విషయాల చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఒకో ఇంద్రియానికి ఒకో విషయం ఉంటుంది అది ఆ విషయం చుట్టూ తిరుగుతూ ఉంటుంది. కొంతమందికి దేహం ఉంటుంది, ఇంద్రియాలు ఉంటాయి. ఈశ్వరుడిలో ఐక్యం అవ్వటంకోసం దేహానికి, ఇంద్రియాలకు వారు దూరం అయిపోతారు. లోకంలో కొద్దిమందిమాత్రమే ఇలా ఉంటారు. వారు మాత్రమే నన్ను అనుసరించగలరు. వారు నపుంసకులు అవుతారు అంటే శారీరకంగా నపుంసకులు అనికాదు, నాకోసం నపుంసకులు అవుతారు. లోక ప్రయోజనాలు ఆశించి వారు త్యాగం చేయటం లేదు, నన్ను పొందటానికి త్యాగం చేస్తున్నారు, వారు మాత్రమే నన్ను అనుసరించగలరు అన్నాడు ఏసు. నీ మనస్సే ఇంద్రియాలను విషయాల మీదకు గెంటుతోంది. ఏ మనస్సు అయితే ఇంద్రియాలను విషయచింతనలోనికి నెట్టుతోందో ఆ మనస్సును జ్ఞాన సముద్రంలో ముంచు అంటున్నాడు పరమాత్మ. నీ కళ్ళు నిన్ను శాశ్వతంగా నరకంలోనికి తీసుకొని పోతూ ఉంటే నీ కళ్ళను పీకి ఆవల పారెయ్యి. నువ్వు శాశ్వతంగా నరకంలో ఉండటం కంటే తాత్కాలికంగా నీకు గుడ్డితనం వచ్చినా ఫరవాలేదు అంటాడు ఏసు. మనస్సే

మీ శరీరాన్ని కల్పించింది. అందుచేత మనస్సులో ఏ వికారం వచ్చినా అది కళ్ళలో కనబడుతుంది. మీ కళ్ళను ఎంతసేపు మూసుకోగలరు. అక్కడ ప్రేమ ఉందా, అసూయ ఉందా, కోపంతో కాలిపోతున్నారా అనేది మీ కళ్ళను చూస్తే తెలిసిపోతుంది. కొంతమంది పరమపవిత్రులు ఉంటారు. మన సాధనతో సంబంధం లేకుండా కేవలం వారిని చూడటం వలననే మనకు జ్ఞానం కలుగుతుంది.

నువ్వు ఆసక్తిరహితుడిగా ఉండు. నీ మనస్సు జ్ఞానంలో కూరుకొనిపోయి ఉండాలి. నీకు ఆత్మచింతన తప్పించి విషయచింతన అసలు ఉండకూడదు. నీవు ఏది చింతిస్తే అదే అవుతావు. అందుచేత నీ మనస్సు ఆత్మచింతనలో, భగవంతుని స్మరణలో కూరుకుపోయి ఉండాలి. మనం సన్మానాలు చేయించుకోకూడదు. దేనికండి సన్మానాలు, అది అంతా దుమ్ము. మీరు ఐన్‌స్టీన్‌ను గుర్తుపెట్టుకోండి. ఆయన శరీరాన్ని ఫలానా చోట కాల్చేసారు అనే గుర్తు కూడా వద్దు అని చెప్పాడు. అది మోస్ట్ ఇంపెర్సనల్‌లైఫ్. మనం ఇంపెర్సనల్‌గా ఉండటం ఇప్పటినుండి ప్రాక్టీసు చెయ్యాలి. అప్పుడు ప్రాణప్రయాణ సమయంలో ఆస్థితి మనకు దొరుకుతుంది. ఈశ్వరుడిని నిరంతరం స్మరిస్తూ ఉంటే మనస్సు చల్లబడిపోతుంది, ఇంద్రియాలు చల్లబడిపోతాయి, మనస్సు యొక్క వాండరింగ్ తగ్గిపోతుంది. శవానికి ఉన్న ఇంద్రియాలు ఎలా ఉంటాయో కొంతమంది భక్తులయొక్క ఇంద్రియాలు కూడా అలా అయిపోతాయి, వారిని లోకంలో బంధించేది ఏమీ ఉండదు. శరీరంలో ఉండగా నేను చేస్తున్నాను అనే తలంపుతోనే మనం మంచిపనులు, చెడ్డపనులు చేస్తాము. మనం చేసిన మంచి పనులకు పుణ్యం, చెడ్డ పనులకు పాపం వస్తుంది. ఆ లగేజీ అంతా మీరు మోసుకొని వెళ్ళవలసిందే. ఈ పుణ్యపాపాలు అనుభవించటానికి మరల శరీరం వస్తుంది, దానికి ముగింపు ఉండదు. అందుచేత మీరు ఈ భూమి మీద తిరుగుతున్నప్పడే మీరు చేసిన పుణ్యపాపములు పూర్తిగా కాలిపోవాలి, అటువంటి విద్యను నేర్చుకో అని పరమాత్మ చెపుతున్నాడు. అందుచేత నువ్వు చేసే పని ఎలా ఉండాలి అంటే నీ శరీరం, ఎముకలు, మాంసం వల్లకాటిలో ఎలా కాలిపోతున్నాయో అలాగే నువ్వు చేసే పని వలన నీ పుణ్యపాపములు కూడా అలాగ కాలిపోవాలి అని పరమాత్మ చెపుతున్నాడు. అప్పడు ఇంక నువ్వు మోసుకొని పోవటానికి ఏమీ ఉండదు, నువ్వు ఖాళీ అయిపోతావు, అప్పడు ఇంక నీకు శాంతే, నీకు సుఖమే. ఇంక నీ పని ఉండటమే. నువ్వు అలాగ ఉండవు, ఇలాగ ఉండవు, నువ్వు నువ్వులాగ ఉంటావు, అప్పడు ఉన్నది ఆనందమే.

రమణ మహర్షిగారు చెప్పిన సిద్ధాంతం ఏమిటి అంటే నీ హృదయంలో తప్పించి, నీ స్వరూపంలో తప్పించి ఏ మనిషిలో కాని, ఏ వస్తువులోకాని, ఏ సంఘటనలో గాని ఎక్కడా సుఖం అనేది లేదు. నీకు అది ఊరికే సుఖంలాగ కనిపిస్తోంది కాని అది సుఖం కాదు. ముందు నువ్వు ఆ నిర్ణయానికి రావాలి. బాహ్యంగా ఎక్కడా సుఖంలేదు అనే నిర్ణయానికి రాకుండా నీ మనస్సు యొక్క చాపల్యాన్ని నువ్వు ఆపుచేయలేవు. మీరు వంద హాస్పటల్స్ కట్టించండి, స్కూల్సు కట్టించండి, వంతెనలు కట్టించండి వీటి అన్నింటికంటే ఒక్కడికి జ్ఞానోదయం కలుగజేయటం చాలా కష్టం. అందులో ఉన్న కష్టం మీకు తెలియదు. డబ్బు ఉంటే, సిమ్మెంట్ ఉంటే, ఐరన్ ఉంటే వంతెనలు, బిల్డింగులు అయిపోతాయి కాని ఒక మనిషిని తయారుచేసి వాడికి జ్ఞానోదయం కలుగజేయటం చాలా కష్టం. దేవుడు అంటే ఎవడు అంటే ఎవడికైతే స్వార్థం లేదో వాడే దేవుడు. స్వార్థచింతన లేనివాడు ప్రతివాడు దేవుడే. దేవుడు అక్కడ ఉన్నాడు, ఇక్కడ ఉన్నాడు అని నేను చెప్పను ఎవడైతే నూటికి నూరుపాళ్ళు నిస్వార్థపరుడో వాడే దేవుడు అని స్వామీజీ చెప్పారు. మీరు చెప్పే మాటకు ఏమైనా ప్రమాణం ఉందా అంటే నా అనుభవమే ప్రమాణం అనేవారు. పాపము, పుణ్యము రెండూ బంధాలే, రెండూ పునర్జన్మ హేతువులే. నువ్వు ఏ పని చేసినా అది భగవంతుని ప్రీత్యర్థం కనుక చేస్తే పుణ్యం కాలిపోతుంది, పాపం కాలిపోతుంది.

భారతయుద్ధంలో ధర్మరాజును కృష్ణుడు ఒక చిన్న అబద్ధం చెప్పమన్నాడు. ఆయన దేవుడు, పక్కన ఉండి అబద్దం చెప్పమంటున్నాడు అయినా నేను చెప్పను అన్నాడు ధర్మరాజు. దాని వలన పాపం వస్తుందని ధర్మరాజుకు భయం. కృష్ణుడు అది గ్రహించాడు. పాపం వస్తుందని నువ్వు అనుకొంటున్నావు, నేను ఎన్ని పాపాలనైనా మోయగలను. ఆ పాపాన్ని కూడా నేను మోస్తాను అని కృష్ణుడు చెప్పాడు అప్పుడుగాని ధర్మరాజు చెప్పలేదు. భగవంతుడికి పాపం ఏమిటి? పుణ్యం ఏమిటి? అబద్దం చెపితే పాపం వస్తుంది కరక్టే కాని లోకకళ్యాణం కోసం మనం ఒక అబద్ధం చెప్పినా అది అబద్ధం అనిపించుకోదు, అది కూడా కొట్టుకొని పోతుంది. మీరు అబద్దాలు చెపితే చెడ్డే ఎందుకంటే మీలో స్వార్థం ఉంది. అక్కడ పరమేశ్వరుడికి స్వార్థం ఏముంది. రాముడు, కృష్ణుడు వారు అవతారపురుషులు. నువ్వు అయోధ్యను విడిచిపెట్టు అంటే అయిదు నిమిషాలలో అయోధ్యను ఖాళీచేసి వెళ్ళిపోతాడు, వాడు రాముడు. కృష్ణుడు గోపికలను ఎంతో ప్రేమించాడు, బృందావనం మట్టి అంటే ఆయనకు చాలా ఇష్టం. ఆ గోపికలను, బృందావనాన్ని విడిచిపెట్టి రెండు నిమిషాలలో మధుర

వెళ్ళిపోయాడు, వాడు దేవుడు. మనం తాటాకు ఇల్లు విడిచిపెట్టలేకపోతున్నాము, అద్దె కొంపలు విడిచిపెట్టలేకపోతున్నాము, పిడకలను విడిచిపెట్టలేకపోతున్నాము, కాశీ వెళ్ళి జిన్నూరులో వర్షాలు పడుతున్నాయేమో, పిడకలు తడిసిపోతాయి అని ఆలోచిస్తున్నాము, ఇదీ మన గోల. నేను రాముడితో సమానం, కృష్ణుడితో సమానం అని ఇలా జనం తయారు అవుతున్నారు. వారు కొన్ని క్షణాలలో రాజ్యాలను విడిచిపెట్టి వెళ్ళిపోయారు మనం కనీసం పిడకలను విడిచి పెట్టలేము. భగవంతుడిలో ఉన్న వైరాగ్యం యొక్క వైభవం అటువంటిది, అక్కడ వైరాగ్యం కంప్లీట్‌గా ఉంటుంది కాని సగం సగంగా కాదు. అరుణాచలం, తిరుపతి, కాశీ ఇవి అన్నీ మనకు అవుట్‌లెట్లలా తయారు అయ్యాయి. ఇంటి దగ్గర కోపంగా ఉంటే, అశాంతిగా ఉంటే తిరుపతి వెళ్ళి రావటం. ఇంకా ఏమైనా కోరికలు ఉంటే అవి నెరవేర్చమని ముండనం చేయించుకోవటం. అశాంతిగా ఉంటే అరుణాచలం వెళ్ళటం. ఇంటి దగ్గర చిరాకుగా ఉంది ఎక్కడికైనా వెళ్ళి వచ్చేద్దాము అంటే ఎక్కడికి వెళతారు. మన కోపం ఇంట్లోవారు పడరు మరి ఎక్కడో ఒకచోట అప్పగించి వచ్చేస్తూ ఉంటాము.

గాంధీగారు భగవద్గీతను ఎప్పుడూ భగవద్గీత అనలేదు, అది మా అమ్మ అనేవారు. నా అనుచరులు, స్నేహితులు నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయినప్పుడు, అసలు ముందుకు అడుగు ఎలా వెయ్యాలో తెలియనప్పుడు కూడా మా అమ్మ నన్ను విడిచిపెట్టలేదు అంటే భగవద్గీతలో నుండి గైడెన్స్ రావటం ఆగలేదు, ఏదో శ్లోకంలో నుండి నాకు మెసేజ్ వచ్చి కొండలు పిండిచేసేంత శక్తితో, అంత వేగంతో మరల ప్రజలలోనికి వెళ్ళేవాడిని అని గాంధీగారు చెప్పారు. గీతా అధ్యయనం వలన నాకు ఆ శక్తి వచ్చింది అని చెప్పారు.

భగవంతుడు కాలరూపంలో ఉన్నాడు. కాలాన్ని గౌరవిస్తే భగవంతుడిని గౌరవించినట్లు అవుతుంది. కాలాన్ని పాడుచేసుకోవద్దు. మీరు చాలాచోట్ల సత్సంగాలు చేసుకొంటున్నారు సత్సంగం అయిన వెంటనే ఇంటికి వెళ్ళిపోండి, అక్కడ కూర్చోవద్దు. ఇంకా అక్కడే ఉంటే ఆత్మ విచారణకు బదులు లోక విచారణ వచ్చేస్తుంది, అక్కడ నుండి మీ పతనం ప్రారంభమవుతుంది. మనం మంచి నీళ్ళు తాగేటప్పుడు ముందు అందులో ఏమైనా నలకలు ఉన్నాయా అని చూసుకొంటాము కదా అలాగే మనం ఏదైనా పని ప్రారంభించేటప్పడే అది గౌరవం కోసం చేస్తున్నామా, ఏదైనా ఆశించి చేస్తున్నామా, ఆ పని చేయటం వలన దేహవాసన, లోకవాసన పెరిగే అవకాశాలు ఉన్నాయా లేక అక్కడ అవసరముండి ఆ పని చేస్తున్నామా అని ముందే

విశ్లేషణ చేసుకొని ఆ పని ప్రారంభించండి. ఇప్పుడు మనం చేసే పనుల వలన రూపబుద్ధి, నామబుద్ధి పెరిగిపోతుంది, నరకానికి మెట్లు కట్టుకొంటున్నాము. అందువలన నువ్వు పని ప్రారంభించేటప్పడే ఫలకాంక్ష ఎంతవరకు ఉందో చూసుకో, కర్తృత్వం నుండి మనిషికి దుఃఖం వస్తోంది. నువ్వు కర్తృత్వంతో పనిచేస్తూ, అహంకారంతో పనిచేస్తూ ఇదంతా దేవుడు చేస్తున్నాడు అంటావు ఏమిటి? నీ అహంకారాన్ని నేను కల్పించలేదు, ఫలానా కర్మ చేయమని నేను కల్పించటంలేదు. నీ వాసనను బట్టి నువ్వు పనిచేస్తున్నావు. భగవద్గీత చదవకుండా కూడా మంచిపనులు చేసేవారు ఉన్నారు, అది వారి సంస్కారం. వారికి సహజంగా మంచిబుద్ధి ఉండవచ్చు. నువ్వు చెడ్డపని చేస్తే నీ వాసనను బట్టి నువ్వు చేస్తావు, నాకు ఆ గొడవకు అసలు సంబంధం ఏమిటి? నీ వాసనను బట్టి ప్రవర్తిస్తున్నావు దానికి నాకు సంబంధం లేదు కాని నాకు సంబంధం ఉన్నట్లు మీరు కల్పిస్తున్నారు. కొంతమంది వ్యవహారాలలో కూడా అంతే అక్కడ ఎవరైతే లేరో వారు ఈ మాటలు చెప్పారండి అంటారు, నిజంగా వాడు చెప్పి ఉండడు. మాకు ఇటువంటి పేచీలు తెచ్చిపెట్టేవారు ఉన్నారు అసలు ఆ గొడవలో నేను లేకపోయినా నాన్నగారి అభిప్రాయం ఇది, నాన్నగారు ఇలా చెప్పారు అనేవారు కూడా ఉన్నారు.

దేవుడు కర్తృత్వరహితుడు. నీకు కర్తృత్వం ఉంది. దేవుడిని తెలుసుకొన్న వెంటనే నీవు కూడా కర్తృత్వరహితుడివే అని నీకు తెలుస్తుంది. కర్తృత్వం లేకపోతే ప్రపంచంలో ఎవరికి లేని దుఃఖం మీకు వచ్చినా మీకు ఏమీ అనిపించదు. కనీసం మీకు ఎర్రచీమ కుట్టినట్లుగా కూడా ఉండదు. దేవుడికి మీ పుణ్యం అక్కరలేదు, మీ పాపం ఆయనకు అక్కరలేదు, మీ గొడవలు ఆయనకు అక్కరలేదు. అయితే మీరు భగవద్గీతలోని శ్లోకాలు జాగ్రత్తగా చదువుతూ అర్థం చేసుకొంటూ ఉంటే మీకు భగవంతుడు అనుభవంలోనికి రాకపోయినా భగవంతుడు మనకు ఇంత దగ్గరగా వస్తున్నాడు ఏమిటి, ఎక్కడో వైకుంఠంలో ఉన్నవాడు మన ఇంటికి వచ్చేస్తున్నాడు ఏమిటి, ఇంక మన చేతికి దొరికేస్తాడు అని మనకు అనిపిస్తుంది. మీకు రైట్ అండర్‌స్టాండింగ్ ఉంటే అంతదూరం తీసుకొని పోతుంది. అయితే మనకు అంత ఓపిక, అంత టైము లేదు. కాలక్షేపానికి ఏవో ఊరిలో గొడవలు ఉంటాయి కదా అవి పట్టుకొని వేలాడుతూ ఉంటాము కాని భగవంతుడిని తెలుసుకోవాలనే తలంపు మనకు రావటంలేదు. అసలు మీరు పని మొదలుపెట్టేటప్పడే అందులో ఏముందో మీకు తెలుస్తుంది కదా. ఆ పని చేయుటం వలన ఏమైనా దేహవాసన, లోకవాసన పెరుగుతుందా, ఏమైనా గొప్పలు ఆశించి ఈ పనులు చేస్తున్నామా ఇవన్నీ మీకు లోపల తెలిసిపోతూ ఉంటాయి. అటువంటి

బలహీనతలు ఏమైనా ఉంటే, మురికి ఉంటే ముందు స్టార్టింగ్‌లోనే వాటిని తీసేయండి, లేకపోతే గోతిలో పడిపోతారు ఇంక అందులోనుండి బయటకు రాలేరు. నువ్వు జ్ఞానం అనే అగ్నిని సంపాదించు. అగ్నిచేత మన దేహం ఎలా దహింపబడుతుందో అలాగ నీ దుఃఖానికి కారణమైన కర్తృత్వబుద్ధిని భగవంతుడు ప్రసాదించిన జ్ఞానం అనే అగ్నితో కాల్చిబూడిద చెయ్యి. తన అజ్ఞానాన్ని అహంకారాన్ని జ్ఞానాగ్నితో ఎవడైతే దహనం చేస్తున్నాడో వాడే పండితుడు. శబ్దాడంబరం ఉన్నవాడు, రచనలు చేసేవాడు, చిలుక పలుకలు పలికేవాడు పండితుడు కాదు. ఎవడైతే తనలో ఉన్న అజ్ఞానాన్ని మూలంతో సహా నాశనం చేస్తున్నాడో, ఎవడైతే దేహబుద్ధిని వేరుతో సహా కాల్చి బూడిద చేస్తున్నాడో వాడు మాత్రమే పండితుడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-10-2010, నరసాపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీరు అందరూ నూటికి నూరుపాళ్ళు సుఖాన్ని, శాంతిని పొందాలి. మీరు ఎవరి భక్తులు అయినా అభ్యంతరం లేదు. మేము ఇంపెర్సనల్‌గానే ఉంటాము. మీరు జీవన్ముక్తులు అవ్వాలి. మీ శరీరం భూమి మీద తిరుగాడుతున్నప్పడే నిర్వాణసుఖాన్ని మీరు పొందాలి. ఈ మీటింగుల లక్ష్యం అదే. భౌతికమైన ప్రయోజనం ఈ మీటింగులకు ఏమీ లేదు. ప్రారబ్ధాన్ని బట్టి మనకు హెచ్చుతగ్గులు వస్తూ ఉంటాయి. ఈ లాభనష్టాలు, కష్టసుఖాలు, చావు పుట్టుకలు ఇవన్నీ శరీరానికి సంబంధించినవే. ఈ శరీరానికి లోపల ఉన్న చైతన్యానికి ఇసుమంతయు సంబంధం లేదు. మనం ఏ దేహాన్ని, ఏ మనస్సును, ఏ బుద్ధిని మనం అనుకొంటున్నామో ఇవన్నీ జడవస్తువులు. అయితే శరీరం కదులుతోంది, మనస్సు ఆలోచిస్తోంది, బుద్ధి నిర్ణయిస్తోంది ఇవన్నీ జడం ఏమిటి అని మీరు అనుకోవచ్చు. మీ లోపల ఏ చైతన్యం అయితే ఉందో దాని సహాయంతోటే ఇవి అన్నీ పనిచేస్తున్నాయి. లోపల ఉన్న చైతన్యం కొంచెం ప్రక్కకు తప్పకొంటే కాళ్ళు చేతులు పనిచేయవు, మనస్సు పనిచేయదు, బుద్ధి పనిచేయదు, అప్పడు వాడు చనిపోయాడు అంటారు.

మీరు నిద్రలో నుండి మేల్కొని బయటకు వస్తున్నారు కదా అది కాదు మిమ్మల్ని ఆభవ, పూర్ణ, చిత్ సుఖంలోనికి మేల్కోమంటున్నాడు. సముద్రంలో ఎంత నీరు ఉందో అంత సుఖంలో మీరు ఓలలాడాలి. ఇప్పడు మనకు శరీరంతో ఎలా అయితే తాదాత్మ్యం ఉందో అలాగ లోపలఉన్న సత్యపదార్థంతో మనకు తాదాత్మ్యం రావాలి. అప్పడు మనకు నిజమైన

సుఖం, శాంతి అందుతుంది. మనం అనుభవించే కొలది ఆ సుఖం పెరుగుతుంది కాని తరగదు. మనం కబుర్లు చెప్పటంకాదు ముందు మనం ఆ స్థాయిని పొందాలి. మన శరీరం పుట్టింది తరువాత చనిపోతుంది. మన లోపల ఉన్న సత్యపదార్థానికి చావులేదు పుట్టుకలేదు. దుఃఖం ఎలా ఉంటుందో దానికి తెలియదు. దాని స్వరూపమే సుఖం, దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే ఆనందం, దాని స్వరూపమే ఉండటం. ఇప్పుడు మనకు శరీరం వచ్చింది. ఈ శరీరానికి సంబంధించిన సుఖాలు మనకు తెలుస్తున్నాయి. అంటే పుట్టిన సుఖాలు ఎలా ఉన్నాయో మనకు తెలుస్తున్నాయికాని పుట్టని సుఖం ఎలా ఉంటుందో మనకు తెలియటం లేదు. అది ఎప్పుడు తెలుస్తుంది అంటే మనలో ఉన్న సత్యవస్తువు మనకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఆ సుఖం గురించి మనకు తెలుస్తుంది. అది పూర్ణసుఖం, ఆ సుఖం ఎవడికైతే అనుభవంలోనికి వచ్చిందో వాడికి శరీరం ఉండటం వలన లాభంలేదు, శరీరం పోవటం వలన వచ్చే నష్టంలేదు. ఎందుచేతనంటే వాడు సుఖంకోసం శరీరం మీద ఆధారపడడు. అది మామూలు సుఖంకాదు, అది చైతన్యసుఖం. మనం ఆత్మవిద్యను నేర్చుకోవటం మానేసి మాయ విద్యలతో తిరుగుతూ మాయలో పడి ఇలా దుఃఖపడుతున్నాము అన్నారు రమణస్వామి. మనం కాలేజీలలో నేర్చుకొనే విద్యల వల్ల శాంతిసామ్రాజ్యాన్ని అందుకోలేము. ఏది నిజమైన విద్యో దానిని తెలుసుకొంటేనే అంటే ఆత్మవిద్యను నేర్చుకొంటేనే హృదయంలో ఉన్న నిజం మనకు తెలుస్తుంది. ఏది నిజమైన విద్యో ఆ విద్యను నాకు నేర్పవయ్యా అని రమణస్వామి అక్షరమణమాలలో అరుణాచలేశ్వరుడిని అర్థించారు.

ఈ శరీరం భూమి మీద తిరుగుతున్నప్పుడే మీరు లోకాన్ని జయించాలి. అంటే లోకంలో ఏ విషయాలు అయితే మిమ్మల్ని ఆకర్షిస్తున్నాయో ఈ లోకంలో ఉండగానే వాటిని అతిక్రమించాలి. లోకాన్ని జయించటం అంటే సంసారాన్ని జయించమని చెప్పకుండా చెప్పటం. ఎవడి మనస్సు అయితే నిరాడంబరంగా ఉందో, ఎవడి మనస్సు అయితే రాగద్వేషములకు అతీతంగా ఉందో, అదృష్టం వెంటాడుతున్నా, దురదృష్టం వెంటాడుతున్నా ఎవడి మనస్సు అయితే నిశ్చలంగా నిర్మలంగా సమానంగా ఉందో వాడు మాత్రమే బ్రాహ్మీస్థితిని పొందుతాడు. మనకు అనుకూలమైన పరిస్థితులు ఉంటే ఒకరకంగా ఉంటాము, ప్రతికూలమైన పరిస్థితులు ఉంటే ఒకరకంగా ఉంటాము. అలాకాదు పరిస్థితులు ఎలా ఉన్నా ఎవడి మనస్సు అయితే సమానంగా ఉందో వాడు మాత్రమే బ్రహ్మంను పొందటానికి ఫిట్ అవుతాడు. బ్రహ్మంను తెలుసుకోవటానికి మేము వెళతాము అంటే మనలను వెళ్ళనివ్వరు. మనలో ఉన్న ఆడంబరం వలన మనలను

అక్కడకు రానివ్వరు. మనకు అసలు లోచూపు ఉందా, లోపల జీవితంలో సౌందర్యం ఉందా అని ఈశ్వరుడు చూసుకొంటాడు.

బ్రహ్మపదార్థానికి దోషాలు ఎలా ఉంటాయో, బలహీనతలు ఎలా ఉంటాయో తెలియవు. బ్రహ్మం ఎలా ఉందో నువ్వు కూడా అలా ఉంటే కదా దానిని పొందేది. ఇది కేవలం చదవటం వలన రాదు. అసలు భగవంతుడు ఏ స్థాయిలో చెపుతున్నాడో అది ముందు మనం పట్టుకోవాలి. ఏదైనా కారణం వలన మన మనస్సు బాహ్యముఖం అవుతోంది అనుకోండి ఇంక మనం బ్రహ్మంను పొందలేము. ఏదైనా ఒక్క బలహీనత మనకు ఉంటే ఆ బలహీనత వలన మనకు పునర్జన్మ వచ్చేస్తుంది కాని బ్రహ్మాన్ని పొందలేము. దానిని పొందటానికి కేవలం మన ప్రయత్నం ఒక్కటే సరిపోదు. ఈశ్వరుని దయ ఉండాలి, గురువు దయ ఉండాలి. మనం డబ్బు సంపాదించినట్లు ఇది సంపాదించేదికాదు. ఈశ్వరునిదయ వలన మనకు లోపల నుండి జ్ఞానం ఊరాలి. చీమలో, దోమలో, ఏనుగులో, మనిషిలో అన్ని శరీరాలలో బ్రహ్మం సమానంగా ఉంటుంది. బ్రహ్మం ఎంత సమానంగా ఉందో నీ మనస్సు కూడా అంత సమానం అయితే, ఆ స్థాయికి వస్తే నువ్వు దానిని పొందగలవు.

తెలివైన చేపలు వలలో పడవు, తెలివి తక్కువ చేపలు ముందు వలలో పడిపోతాయి తరువాత దాకలోనికి వెళ్ళిపోతాయి. మనం కూడా వలలో పడిపోయాము. బయటకు రావటానికి ప్రయత్నం చేస్తున్నాము. కొంతమంది అసలు బయటకు రావటానికి కూడా ప్రయత్నం చెయ్యరు. మనందరం తెలివి తక్కువమంద, సరిగ్గా మాయ అనే వలలోపడిపోయి జనన మరణ ప్రవాహంలో కొట్టుకొనిపోతున్నాము. మనం జనరల్‌గా కోరికతో కర్మ చేస్తాము. కోరికతో చేసే కర్మలు అన్నీ పునర్జన్మలను తీసుకొని వస్తాయి. కోరిక లేకుండా నువ్వు కర్మచేస్తే నువ్వు పరిశుద్ధుడవు అవుతావు. సత్కర్మ చేస్తే సరిపోదు, సత్కర్మ నిష్కామంగా చేయాలి, అప్పుడు బ్రహ్మాన్ని పొందటానికి నువ్వు ఫిట్ అవుతావు. నువ్వు ఎంత మంచి పని చేసినా అది సకామంగా కనుక చేస్తే అది నిన్ను బంధించి తీరుతుంది. సత్కర్మ నిష్కామంగా చేస్తే బంధంలో నుండి విడుదల పొందుతావు. సత్కర్మ సకామంగా చేస్తే బంధంలో కూరుకొనిపోతావు, చనిపోయిన తరువాత నీకు చీకటిలోకాలు మిగులుతాయి. కొంతమంది సత్కర్మ చేసి గుర్తింపులు కోరుకొంటారు. ఆ గుర్తింపుల వలన అహంభావన పెరుగుతుందని, అజ్ఞానం పెరుగుతుందన్న సంగతి మనకు తెలియటంలేదు. అది ముందు మనకు తెలియాలి. ఎక్కడ మనం ప్రమాదంలో పడుతున్నామో అది మనకు తెలిస్తే ఆ ప్రమాదంలో నుండి బయట

పడటానికి ప్రయత్నం చేస్తాము. అది మనకు తెలియనప్పుడు అందులోనుండి ఎలాగ బయటకు వస్తాము. ముందు సబ్జక్టు బాగా శ్రవణం చేయాలి. ఆత్మానందం మీకు అందకపోయినా ముందు శ్రవణానందం పొందాలి. ఇప్పుడు మీరు శ్రవణం చేస్తున్నారు. దీని వలన మీకు ఎంతో కొంత ఆనందం రావాలి. ఆనందం రావటంలేదు అంటే మీకు సబ్జక్టు అర్థమవ్వటంలేదు. సబ్జక్టు మీకు ఎంతోకొంత అందుతూ ఉంటే మీరు ఎంజాయ్ చెయ్యకుండా ఉండలేరు.

పవిత్రమైన అంతఃకరణము కలిగి ఉండాలి. శాంతచిత్తము కలిగి ఉండాలి. బాహ్యంగా మీకు ఎన్ని ఉన్నా శాంతచిత్తము కనుక లేకపోతే మీరు దురదృష్టవంతులే. ఇంటి దగ్గర పరిస్థితులు మీకు ఎంత ప్రతికూలంగా ఉన్నా శాంతచిత్తము కలిగి ఉండాలి. మీకు చైతన్య పదార్థం తాలుక ఎరుక ఉండాలి. ఇప్పుడు మీ దేహం మీకు ఎరుకలో ఉంది, మీ ఇష్టాలు, అయిష్టాలు మీకు ఎరుకలో ఉన్నాయి, మా మనస్సు ఈ మధ్య బాగాలేదు అంటారు అంటే మీ మనస్సు మీకు ఎరుకలో ఉంది అలాగే లోపలఉన్న సత్యపదార్థం తాలుక ఎరుకు మీకు ఉండాలి. మీకు ఏ వస్తువునైతే పొందాలి అనుకొంటున్నారో ఆ వస్తువు గురించి విసుగు లేకుండా శ్రవణం చేయాలి. దానిమీద మీకు ప్రేమ ఉండాలి, దానిని పొందాలి అనే కాంక్ష ఉండాలి. మామూలుగా మీ శరీరం మీద ఉన్న ప్రీతి, ప్రాపంచిక విషయాలమీద ఉన్న ప్రీతి లోపల ఉన్న సత్యపదార్థం మీద మీకు లేదు ఇంక మీరు దానిని ఎలా పొందగలరు. మేము చాలా మంచివారము, సాధన చేస్తున్నాము, మాకు అర్హత వచ్చింది అని చాలామంది అనుకొంటారు. కాని మీరు చేసే పనులు భగవంతుడికోసం చేస్తున్నారా, లోకంలో ఏదైనా ఆశించి చేస్తున్నారా అని పరమాత్మ చూస్తూ ఉంటాడు. మీరు ఏదైనా కోరికతో మంచిపనులు చేస్తే గౌరవం వస్తుంది కాని చిత్తశుద్ధి రాదు. నీ కుడిచేయి చేసే పని ఎడమచేయికి తెలియకూడదు. నువ్వు చేసేపని అంత క్వయిట్‌గా ఉండాలి. నీ లోపలఉన్న బ్రహ్మపదార్థం రూపరహితం, నామరహితం. మనం నామరూపాలను పట్టుకొని తిరుగుతూ, వాటిని స్మరిస్తూ జీవిస్తున్నాము. మనస్సుకు పరిమితమై జీవిస్తున్నాము. ఇంక నీకు మోక్షం ఎలా వస్తుంది, అది సాధ్యం కాదు.

మేము మంచివారము అని చాలామంది అనుకొంటూ ఉంటారు. మీరు మంచివారు అని భగవంతుడు అనుకోవాలి కాని మీరు అనుకోవటం ఏమిటి? మీరు మంచివారు అని ఎవరు మీకు చెప్పారు. భగవంతుడు ఏమైనా మీకు సర్టిఫికేట్ ఇచ్చాడా? మన అహంకారం చెపితే ఎలా కుదురుతుంది, భగవంతుడు గుర్తించాలి కదా. నీకు మంచి క్వాలిటీ ఉందని

బయట నలుగురుచేత అనిపించుకొంటే ఆ నలుగురు కాదు కదా నీకు మోక్షం ఇచ్చేది. అంతర్యామిగా ఉన్న భగవంతుడు కదా మనకు మోక్షం ఇచ్చేది అందుచేత మనం మంచివారము అని ఆయన గుర్తించాలి. బయట వ్యక్తులు నిన్ను మంచివాడు అన్నంత మాత్రంచేత నీకు కలిసివచ్చేది ఏమీ లేదు పైగా నీ అహంకారం పెరుగుతుంది. మనస్సును, ఇంద్రియాలను నియమించుకోవాలి, వాటిని క్రమశిక్షణలో ఉంచాలి. మీకు బాగా డబ్బు ఉంది అనుకోండి, బాగా చదువు ఉంది అనుకోండి, క్రమశిక్షణ లేదు అనుకోండి. అప్పుడు మీ డబ్బు, మీ చదువు మీకు అపకారం చేస్తాయి. కనీసం స్వప్నంలో కూడా ఈ ప్రపంచాన్ని నేను ఎప్పుడూ ఎంజాయ్ చేయలేదు అని రామకృష్ణుడు చెప్పాడు. ఆ స్థాయిని మనం అందుకోలేక పోయినా కనీసం వారిని చూసి ఆనందించాలి, ఆ వాక్యాన్ని ఎంజాయ్ చేయాలి. విని సంతోషించే బుద్ధి కూడా మనకు లేకపోతే ఎలాగ.

మన గుణాలు వేరు, రంగులు వేరు, కులాలు వేరు, మతాలు వేరు. కాని అందరిలో ఉన్న ఆత్మ ఒక్కటే అనే భావన మనకు స్థిరపడాలి. అందరిలో ఉన్న ఆత్మ నాలోను ఉంది, నాలో ఉన్న ఆత్మే అందరిలోను ఉంది. అందుచేత ఇతరులకు నీవు ఏది చేసినా అది నీకే తిరిగి వస్తుంది ఎందుచేత అక్కడ ఉన్నది నీవే. ఇతరులకు మీరు ఏదైనా సహాయం చేసినా ఆ శరీరం కూడా మీదే అనుకోవాలి. అప్పుడు వేరుభావనపోతుంది, మీకు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి అనే గుమ్మంలోనుండే మనం బ్రాహ్మీస్థితిలో ప్రవేశించాలి. వారిని ఉద్ధరించాను, వీరికి సహాయం చేసాను అని నీవు ఎందుకు అనుకొంటున్నావు అంటే ఆ సహాయం నీకే తిరిగివస్తుంది అని తెలియకపోవటం వలన అలా అనుకొంటున్నావు. నీకు తెలిసినా తెలియకపోయినా జరిగేది అదే. శరీరాన్ని ఈ భూమి మీద ఎలా విడిచిపెట్టేస్తున్నాడో అలాగ పుణ్యపాపాలను కూడా ఇక్కడ వదిలేసి ఎవడైతే వెళ్ళిపోతున్నాడో వాడే బుద్ధిమంతుడు. మనం పుణ్యపాపాలను ఎక్కడ విడిచిపెట్టగలము వాటిని మోసుకొనిపోతాము. పుణ్యపాపాలను విడిచి పెట్టటం అంత తేలికకాదు. బాహ్యవిషయాలలో ఏమీ లేకపోయినా అక్కడ ఏదో ఉందని అనుకోవటం వలన, బాహ్యవిషయాలను ఎంజాయ్‌చేయటంవలన మనస్సు బయటకు పరుగులు తీస్తుంది. వేలాది మైళ్ళు బయటకు వెళ్ళిపోతుంది కాని మనస్సు ఒక్క అంగుళం లోపలకు వెళ్ళమంటే అది వెళ్ళదు. మాయ అంతా అక్కడే ఉంది. బయట శాంతి ఉంది, బయట వ్యక్తులలో ఏదో ఆనందం ఉంది అనుకొంటూ ఉంటే అది బయటకు పోవటం మానుతుందా? బాహ్యవిషయాలపట్ల నీకు ఆసక్తి ఉంది. ఆసక్తి ఉన్నప్పుడు మనస్సు గంతులు

వేయటం ఎలా మానుతుంది. బాహ్యవిషయాల పట్ల ఆసక్తి తగ్గించుకోండి అప్పుడు మీ మనస్సు బయటకు విజృంభించటం మానేసి లోపలకు జరగటం ప్రారంభిస్తుంది. మనస్సుకు లోచూపు రాకుండా ఆత్మజ్ఞానం కలుగదు. ఎవడి మనస్సుకు అయితే కంప్లీట్‌గా ఆసక్తి తగ్గిపోతోందో వాడి మనస్సు లోపలకు ఉపసంహరింపబడి, లోపలఉన్న శాంతిస్థానాన్ని చేరుకొని అక్కడ ఉన్న శాంతిని, సుఖాన్ని జుర్రుకోవటం ప్రారంభిస్తుంది. అప్పుడు మనస్సును నువ్వు బయటకు వెళ్ళమన్నా అది వెళ్ళదు ఎందుచేతనంటే దానికి కావలసిన శాంతి, సుఖం అక్కడ సప్లయి అయిపోతుంది.

ఒక విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. మీ స్వరూపంలో తప్పించి బాహ్యంగా ఎక్కడా సుఖం లేదు. అది ముందు మీకు అవగాహన అవ్వాలి. మీ మనస్సుకు అది అర్థమయ్యే లాగ చెపితే గాని అది బయటకు వెళ్ళటం మానదు. మీరు పూజ చేసి, జపం చేసి ఎంతకాలం దానిని ఆపుచేస్తారు. బాహ్యంగా ఏదీ లేదని ముందు మీ మనస్సుకు అర్థమవ్వాలి, ఇదే సాధన అంటే. ముక్కు మూసుకొని ఏదో గదిలో కూర్చోవటం కాదు సబ్జక్టు సరిగా మీకు అర్థమవ్వాలి. మీకు సరియైన అవగాహన లేకుండా సాధన చేసినా సక్సెస్ అవ్వలేరు. ప్రపంచంలో ఉన్న దుఃఖం అంతా వచ్చి మీ నెత్తిమీద పడిపోయింది అనుకోండి అప్పుడు కూడా ఎవడి సుఖం, ఎవడి శాంతి అయితే చలించదో అదే నిజమైన సుఖం, అదే నిజమైన శాంతి. దానికి ప్రమాణం చూసుకోండి. ఇప్పుడు మీరు పొందే సుఖాలు నిజం అనుకోవద్దు, ఇవి నిలబడే సుఖాలు కాదు.

జీవుడికి మూలం బ్రహ్మమే. ఆ బ్రహ్మంలో నుండే జీవపదార్థం వచ్చింది. అంటే ఈ జీవుడు మూలంలోనికి వెళ్ళేకొలది బ్రహ్మంలో ఐక్యమవుతాడు. ఇప్పుడు మీకు శరీరంతో ఎలా తాదాత్మ్యం ఉందో అలా లోపలఉన్న బ్రహ్మపదార్థంతో మీకు తాదాత్మ్యం కుదిరితే ఇంకవాడు ముగింపులేని సుఖాన్ని పొందుతాడు అంటే అక్షయ సుఖాన్ని పొందుతాడు. ఈ శరీరం ఏదో రోజున రాలిపోతుంది. ఆ చనిపోయే రోజుకైనా నువ్వు అక్షయసుఖాన్ని పొందితే ఈ శరీరం పోయినా నువ్వు ఉంటావు అనే అనుభవం నీకు వస్తుంది. సూర్యుడికి చీకటి ఎలా కనబడదో అప్పుడు ఇంక నీకు దుఃఖం కనబడదు. అప్పుడు మీరు దుఃఖం లేని స్థితికి వచ్చేస్తారు. అది మీ తల్లితండ్రులు, బంధువులు మీకు ఇవ్వలేరు, అది గురువుకు మాత్రమే సాధ్యం, అన్నదానం, విద్యాదానం వలన మీకు బ్రాహ్మీస్థితి కలుగదు. జ్ఞానదానం వలన మాత్రమే బ్రాహ్మీస్థితి వస్తుంది. అది గురువుకి మాత్రమే సాధ్యం. గురువు జ్ఞానాన్ని ఇవ్వగలడు. మనం నూతులో కప్పలలాగ

తయారయ్యాము. మనకి జ్ఞానం ఎలాగు లేదు. మనకు ఏదో తెలుసు, ఆ తెలుసున్నదే జ్ఞానం అనుకోవటం, మన పరిస్థితి ఇలా ఉంది. మీ మనస్సు మూసేసుకొంటున్నారు, హృదయాన్ని మూసేసుకొంటున్నారు ఇంక భగవంతుడు ఎవరికి చెప్పాలి. కనీసం ఒకడి హార్ట్ ఓపెన్ అయ్యి ఉంటే భగవంతుడు చెప్పే టీచింగ్ ఉపయోగపడుతుంది. భగవంతుడి యొక్క అనుగ్రహం, జ్ఞానం వర్షం కింద మన మీద కురిసినా మనకు రిసీవ్ చేసుకొనే స్టేషన్ మూసుకుపోయింది కదా.

నీ మనస్సులో కల్మషం ఉంటే పోగొట్టుకో. గురువు ఒకోసారి మీలో ఉన్న కల్మషాన్ని కదిపి అది ఉన్నట్లుగా మీకు తెలియజేస్తాడు లేకపోతే లోపల కల్మషం ఉన్నట్లు కూడా మీకు తెలియదు. లోపల ఇంత కల్మషం ఉంది అని మీకు తెలియజేసి, ఆ కల్మషాన్ని బయటకు లాగుతాడు. మీరు గురువు సహాయంతో కల్మషంలేని స్థితికి ఎదిగిరావాలి. కపటం ఉన్నవారికి, కల్మషం ఉన్నవారికి జ్ఞానం అందదు. భగవంతుడు చెప్పినమాటలను విని మన మానసికస్థాయి ఎలా ఉంది, భగవంతుడు చెప్పే స్థితి ఎలా ఉంది అని చూసుకొని ఆయన చెప్పిన స్థితిని పొందటానికి ప్రయత్నం చేయాలి. మీకు సందేహాలు ఉంటే నివారణ చేసుకోవాలి. ఎవరైనా కష్టాలలో ఉంటే వారందరికీ మీరు సహాయం చేయలేకపోవచ్చుకాని వారి క్షేమం కోరుకోవటంలో దారిద్ర్యం పనికిరాదు. మీ ఇంట్లో దారిద్ర్యం ఉన్నా మనస్సులో మటుకు దారిద్ర్యం ఉండకూడదు. నువ్వు కాని విషయాలతో జత కట్టవద్దు. నువ్వు ఏదిగా ఉన్నావో దానితో తాదాత్మ్యం పొందటం నేర్చుకో. ఎవరైతే మనస్సులో ఉన్న కల్మషాన్ని పోగొట్టుకొన్నారో, ఎవరైతే సంశయరహితులు అయ్యారో, ఎవరైతే ఆత్మతో తాదాత్మ్యం పొందటం నేర్చుకొన్నారో, ఎవరైతే అందరి క్షేమం కోరుతున్నారో అటువంటివారు నెమ్మదిగా స్టడీగా ఈనాటికైనా ముందునాటికైనా బ్రహ్మ నిర్వాణ స్థితిని పొందుతారు. త్రికరణశుద్ధి లేనివాడికి బ్రహ్మజ్ఞానం కలుగదు. వాడికి పాండిత్యం ఉన్నా, ధనం ఉన్నా కూడా కలుగదు ఎందుచేతనంటే ఇది బయటవిషయాల వలన వచ్చేది కాదు. నువ్వు లోపల ఎదగాలి, జ్ఞానగంగ లోపల నుండే రావాలి. మీ మనస్సులో కల్మషం ఉంటే పోగొట్టుకోండి అంతేగాని ఈ కల్మషం ఎప్పుడు వచ్చింది అని అనుకోవద్దు, వెనక్కి వెళ్ళవద్దు. మీకు భగవంతుడి గురించి ఏమైన సంశయాలు ఉంటే వాటిని తొలగించుకోండి. చైతన్యంతో తాదాత్మ్యం పొందండి. అందరి క్షేమం కోరుకో, ఎవరిని చూసి అసూయపడవద్దు. వాషింగ్టన్ ఒక సందర్భంలో చెప్పాడు. నేను ఎవరిని చూసి అసూయపడను. ఇతరులను చూసి అసూయపడటంవలన నా స్థాయి తగ్గిపోతుంది.

అందుచేత అసూయపడను అని చెప్పాడు.

మీరందరూ మనస్సుతో విద్యలు నేర్చుకొంటున్నారు, ఆ మనస్సును చదవటం నేర్చుకోండి. మీ మనస్సును మీరు చదివి, మీ మనస్సును పరిశీలించి, అది మీ మాట వినేటట్లు చూసుకోండి. మీ మనస్సు మీరు చెప్పినట్లు వింటూ ఉంటే ఆత్మసాక్షాత్కారానికి అది దారి చూపిస్తుంది. మీ మనస్సు, ఇంద్రియాలు మీ స్వాధీనంలో ఉంటే అవి మీకు ఉపకారం చేస్తాయి, ఆత్మజ్ఞానసముపార్జనలో మీకు సహకరిస్తాయి. గాలి లేనిచోట దీపం ఎంత స్థిరంగా ఉంటుందో అలాగ మీ మనస్సుకు, ఇంద్రియాలకు అంత స్థిరత్వం వచ్చేస్తే అవి మీకు సహాయం చేసి మీకు పూర్ణస్థితిని తీసుకొనివస్తాయి. అప్పుడు మీ శరీరం చనిపోతున్నా, నేను చనిపోతున్నాను అని మీకు అనిపించదు. మీ మనస్సును చదివి, దానిని పరిశీలించి, దానికి స్థిరత్వం తీసుకొనివచ్చి పూర్ణస్థితిని పొందటానికి ప్రయత్నం చేయండి.

మీరు ఎన్ని యజ్ఞాలు చేసినా, తపస్సులు చేసినా దాని భోక్తని నేనే, మీరు ఏదైనా మంచిపని చేసినా దానిని ఎంజాయ్ చేసేవాడిని నేనే అంటున్నాడు పరమాత్మ. మీరు ఏదైనా మంచిపని చేస్తే భగవంతుడు మిమ్మల్ని చూసి ఆనందిస్తాడు. మీ లోపల ఉన్న జీవుడికి తండ్రి ఆయనే. సమస్త జీవకోటికి తండ్రి ఆయనే. వాళ్ల వలన మనకు ఉపకారం ఉంటే మనం కూడా ఉపకారం చేద్దాము, వాళ్ల వలన మనకు ఉపకారం లేకపోతే మనం కూడా చెయ్యవద్దు అని ఇటువంటి ఆలోచనలో చాలామంది ఉంటారు, సామాన్య మానవుడు కూడా అంతే కదా. నేను అటువంటి వాడిని కాదు అంటున్నాడు పరమాత్మ. నేను సుహృత్‌ని అంటే మీ దగ్గరనుండి ఏమీ ఆశించకుండానే మీకు ఉపయోగపడతాను. ప్రతిఫలం మీద మనస్సు లేకుండా ఇతరులకు సహాయం చేసే వాడిని సుహృత్ అంటారు. నేను మీ అందరి క్షేమం కోరేవాడిని, నేను జ్ఞానదాతను అని కనీసం నా ఔన్నత్యాన్ని మీరు గ్రహించినా మీకు శాంతి కలుగుతుంది. భగవంతుడి యొక్క వైభవం ఇట్టిది, భగవంతుడి ఎడ్మినిస్ట్రేషన్ ఇలా ఉంటుంది, భగవంతుడి యొక్క కళ్యాణగుణాలు ఇలా ఉంటాయి అని భగవంతుడి గురించి మీకు కొంత అవగాహన ఉన్నా మీకు శాంతి కలుగుతుంది. మీకు ఏమైనా తెలివితేటలు ఉన్నా అవి భగవంతుడే ఇచ్చాడు, మీకు డబ్బు ఉన్నా భగవంతుడే ఇచ్చాడు, మీకు ఏదైనా పాండిత్యం ఉన్నా అది భగవంతుడి ప్రసాదమే అని గుర్తింపు వచ్చినా మీకు శాంతి కలుగుతుంది. అంతేగాని భగవంతుడు మీకు ఇచ్చిన ఐశ్వర్యం, ఆయన మీకు ఇచ్చిన తెలివి అది అంతా మీ సొంతం అనుకొంటే ఎలాగ? ఇష్టం ఎంత ప్రమాదమో అయిష్టం కూడా అంతే ప్రమాదం ఎందుచేతనంటే

అవి మనస్సును బయటకు లాగేస్తాయి. మీకు ఎక్కడా బంధం లేకపోతే మనస్సు బయటకు వెళ్ళదు. మీరు సబ్బుతో శరీరం మీద ఉన్న దుమ్మును కడుగుకొంటున్నారు కదా. అలాగే మీరు శ్రవణం చేసి, శ్రవణం చేసి జ్ఞానంతో మనస్సులో ఉన్న కల్మషాన్ని కడుక్కోండి.

ఈశ్వరుని పాదాలయందు మీకు భక్తి లేదు అనుకోండి మీరు గది తలుపులు మూసేసుకొని ధ్యానాలు చేస్తారు అనుకోండి మీ మనస్సులో ఉన్న కల్మషం పోదు. మీకు భక్తి లేకపోతే మీరు సాధన చేసినా రాగద్వేషాలలో నుండి బయటకు రాలేరు. మీరు గురువును ప్రేమిస్తూ ఉంటే, ఈశ్వరునియందు భక్తి కలిగి ఉంటే ఆ భక్తి ప్రవాహంలో, ప్రేమ ప్రవాహంలో రాగద్వేషాలు కొట్టుకొనిపోతాయి కాని మీ అంతట మీరు వాటిని బయటకు గెంటలేరు. అందుచేత నాయందు భక్తి కలిగి ఉండండి, నన్ను స్మరించుకోండి, నన్ను జ్ఞాపకం పెట్టుకోండి అని పరమాత్మ అడుగుతున్నాడు. మనం ఎక్కడ మిస్ అవుతున్నాము అంటే మనం తిరుపతి వెళతాము, భగవంతుడికి నమస్కారం పెడతాము. మనకు లోపల ఏవో కోరికలు ఉంటాయి. ఆ కోరికలు నెరవేరటంకోసం భగవంతుడికి నమస్కారం పెడుతున్నాము కాని ఆయనను పొందటంకోసం ఆయనకు నమస్కారం పెట్టటం లేదు, అది భగవంతుడికి తెలుస్తూ ఉంటుంది. మనకు ఆయన గమ్యంకాదు. మన కోరికలు నెరవేర్చుకోవటం కోసం ఆయనను ఉపయోగించుకొంటున్నాము. ఇక్కడ పరమాత్మ ఏమంటున్నాడు అంటే నన్ను ప్రేమించటం ఒక్కటే సరిపోదు, నన్నే గమ్యంగా పెట్టుకోండి అని చెపుతున్నాడు. మీ సహృదయాన్ని, సద్బుద్ధిని ఉపయోగించుకొని, నన్ను తెలుసుకోవటానికి మీ వివేకాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకొని మీరు పవిత్రులై, జ్ఞానతపస్సు వలన నా స్వరూపాన్ని పొందండి అంటున్నాడు పరమాత్మ. మీ ప్రేమకు ప్రపంచంలోని విషయాలను ఆబ్జక్టుగా పెట్టుకొంటున్నారు. మీ ప్రేమకు ఆబ్జక్టుగా నన్నే పెట్టుకొంటే మీకు తెలియకుండా నెమ్మదిగా మీరు నా స్వరూపాన్ని పొందుతారు అని పరమాత్మ చెపుతున్నాడు. మనం ఆయన దగ్గర నుండి ఏదో ఆశించి ఆయన పట్ల భక్తిగా ఉంటున్నాము. అలాకాదు నీ భక్తికి కూడా గమ్యం నేను అయి ఉండాలి. లోకం గొడవలు ఏవో పొందటానికి నన్ను ఉపయోగించుకోవద్దు, దానివలన మీరు నన్ను పొందలేరు. నాయందు భక్తి కలిగి, నాయందు ప్రేమ కలిగి మీరు చేసే సాధనలు చేస్తూ ఉంటే మీరు ఒడ్డుకు వచ్చేస్తారు. పరమేశ్వరుడి పట్ల భక్తి లేకుండా మీలో ఉన్న బలహీనతలలో నుండి, దేహాభిమానంలో నుండి బయటకు రాలేరు. భక్తి లేకుండా అసలు రాగద్వేషాలలో నుండి బయటకు రాలేరు. అందుచేత భక్తిని కల్టివేట్ చేసుకోండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| నవంబర్ | 9 | మురమళ్ళ, శివాలయం |
| నవంబర్ | 13 | బల్లిపాడు |
| నవంబర్ | 14 | తణుకు, క్షత్రియ కళ్యాణ మండపం |
| నవంబర్ | 21 | అరుణాచలం దీపోత్సవం |
| నవంబర్ | 28 | పాలకొల్లు, క్షత్రియ కళ్యాణ మండపం |
| డిసెంబర్ | 5 | గొరగనమూడి |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha

## ఆచరణ వేదాంతం

మానవుని సచ్చిదానంద స్వరూపునిగా, ముక్తునిగా మార్చేది మనస్సే! అట్లే మానవుని పశువుగా మార్చేది మనస్సే! చీమ మొదలుకొని మనుష్యపర్యంతం ఈ సకల చరాచరసృష్టికి ఏ అనంత, అఖండ, అద్వయ, చైతన్యమైతే ఆధారంగా ఉందో, అదే చైతన్యం అందరి హృదయంలోనూ స్వరూపంగా ఉంది. 'కేవలం బ్రహ్మమే ఉంది', వ్యక్తి అంటు ఎవ్వరూ లేరు. మనము బుద్ధిపరంగా దీనిని సత్యమని భావిస్తున్నాం కాని ఆచరణలోకి వచ్చేసరికి పూర్తిగా వెనుకబడిపోతున్నాం. మనము శ్రవణము చేసిన గురుబోధను, ఆధ్యాత్మిక గ్రంథాలలో చదివిన విషయాలను ఆచరణలో పెట్టాలి, దానినే ఆచరణ వేదాంతం అంటారు. నేర్చుకోవడము, ఇతరులకు చెప్పడము సులభమే కాని ఆచరించడమే కష్టం. కేవలం పుస్తకజ్ఞానం వల్ల ఆత్మజ్ఞానం కలుగదు, సత్యజ్ఞానం వల్లనే కలుగుతుంది. ఆలోచనకు, ఆచరణకు పొంతన ఉండాలి. పాండిత్యం, ధనం, కీర్తి, అధికారం సంపాదించడం కంటే మారు మనస్సును పొందడం కష్టం. ద్వైత బుద్ధిని పెట్టుకొని ద్వంద్వాలను అతిక్రమించలేము. మనస్సు అనగా భేదబుద్ధి నశిస్తేనేగాని అమృతానుభవం కలగదు. త్రికరణముల ద్వారా పరమాత్మను ఆరాధించాలి. సృష్టిని కాక సృష్టికి ఆధారంగా ఉన్న పరమాత్మను చూడడం నేర్చుకోవాలి. దేహం జీవించి యుండగానే దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందాలి. గురుకృప వల్ల అరుదైన అవకాశంగా లభించిన ఈ మానవ జన్మను సారవంతం, ఫలవంతం చేసుకోవాలి.

**- చావలి సూర్యనారాయణమూర్తి, టీచర్, అమలాపురం**

# సర్వత్రా సమదృష్టి కలిగితే - సమాధి సిద్ధిస్తుంది

మనకు అన్యంగా భగవంతుడు ఎక్కడో లేడని ఆత్మగా అన్ని స్థితులకు ఆధారమై ఉన్నాడనే విశ్వాసంతో అందరినీ ప్రేమించాలి. అందరూ నేనే అనే అవగాహనతో జీవించాలి. అన్ని వస్తువుల్లోనూ భగవంతుణ్ణి చూడలేకపోతే మనకు అత్యంత ఇష్టమైన గురువును చూడటం నేర్చుకోవాలి. చివరికి అది పైకి భిన్నత్వం లోపల సత్యమే కనిపిస్తుంది. దేహ వికారాలను చూడకూడదు. అహంకారాన్ని చూడకుండా దివ్యత్వాన్ని దర్శించటమే జ్ఞానం. వస్తు దృష్టితో ప్రాపంచిక వస్తువుల మీద ఆధారపడి ప్రేమిస్తే మోసగించబడతాము. భోగభాగ్యాల మీద నమ్మకం ఉంచకూడదు. ఒక వస్తువులో చెడుచూచినంతకాలం మనం దాన్ని ప్రేమించలేము. ఐక్యతను గుర్తించి అనుభవించటమే పరిశుద్ధత. జగత్తులో దేనికి భ్రమపడకూడదు. నేను శరీరాన్ని కాను అని చెప్పటం తేలికే కాని అనుభవంలోనికి తెచ్చుకోవటం కష్టం. ఈ లోకంలో సమస్త శరీరాలు నావే అనే అనుభవంలోనికి తెచ్చుకోవటం కష్టం. ఈ లోకంలో సమస్త శరీరాలు నావే అనే భావన చెయ్యటం ఒక ఉపాయం. అట్టి భావన కలిగితే ఇతరుల కష్టాలను చూచి వారికి సాయం చెయ్యాలనే సంకల్పం కలుగుతుంది. ఆ సర్వాత్మక బుద్ధితో సత్య దర్శనానికి దారితీస్తుంది. గాంధీజీ "భగవంతుణ్ణి ముఖాముఖి చూడాలనుకొనేవాడు సృష్టిలో ప్రతీ నికృష్టజీవినీ కూడా తనతో సమానంగా భావించి ప్రేమించాలి. అసమానత అనే పదమే దుర్గంధపూరితమైనది. అది అహంకారానికి అమానుషత్వానికీ దారితీస్తుంది" అన్నారు. చర్మం తెల్లగా ఉంటే అందులో గొప్ప మర్మం ఏమీలేదు. ఇతరులు మన పట్ల ఎలా వ్యవహరించాలని మనం అనుకుంటామో అదే విధంగా మనం ఇతరుల పట్ల వ్యవహరించాలి. మనకు దీనుల ఎడ సానుభూతి ఉందా అనేదే ప్రధాన అంశం అది ఉంటే సత్యాన్ని దర్శిస్తాము" అన్నారు రామతీర్థ. వీడు శత్రువు-వీడు మిత్రుడు అనే భ్రాంతి మనకు ఉండకూడదు. వారి ప్రవర్తన యొక్క కారణాన్ని వాళ్ళలో చూడకూడదు. వారు అలా ప్రవర్తించటానికి మూలకారణం మనలోనే ఉంది అని గ్రహించి సమాధానపడాలి. శ్రీనాన్నగారు "మీకర్మ మీ కోడలను మీ ఇంటికి తీసుకొని వచ్చింది అనుకోవాలి" అన్నారు. అహంకారంతో ప్రత్యపకారానికి తలపడి దెబ్బకు దెబ్బ కొడతామో అంతవరకూ మనం మరణించినట్లే. పరమాత్మ యొక్క ప్రతిబింబమే ఈ జగత్తు అంతా నేను. అదే అని మనకు మనమే బోధించుకోవాలి. "పవిత్రతతో, పుణ్యాలతో ఎవ్వరూ శాంతంగా జీవించలేరు. ఎవరికి విశాల దయాపూరిత మాతృహృదయం పాపులను నీచులను కౌగలించుకొంటుందో వారే మహాత్ములు" అంటారు పెద్దలు. సమత్వాన్ని ఊపిరిగా పెట్టుకొన్నవారు సత్యాన్ని దర్శిస్తారు. పూర్ణత్వంతో వెలిగిపోతారు.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం